క్లుప్తంగా

వినాయక చవితి ఉత్సవాలకు పందిరి రాట


పాండురంగాపురంలో పందిరిరాట వేస్తున్న కాలనీ పెద్దలు, మహిళలు

ఆరిలోవ: ఆరిలోవలో వినాయక చవితి ఉత్సవాలకు సన్నాహాలు చేస్తున్నారు. కాలనీల్లో వినాయక విగ్రహాలు ఏర్పాటు చేయడంలో భాగంగా పందిరి రాట ఉత్సవాలు జరుపుతున్నారు. జీవీఎంసీ పదమూడో వార్డులో పలుచోట్ల ఆదివారం రాట ఉత్సవాలు నిర్వహించారు. వార్డు పరిధి పాండురంగాపురంలో కాలనీ యూత్ ఆధ్వర్యంలో పందిరి రాట వేశారు. కార్యక్రమంలో స్థానికులు కెల్ల సత్యనారాయణ, కె.శిరీష, ప్రసంగి వాసు, పాండురంగాపురం యూత్ సభ్యులు పాల్గొన్నారు.

ఏపీలో పెట్టుబడులు సున్నా


మాట్లాడుతున్న పల్లా దుర్గారావు

బీచ్‌రోడ్డు: ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆయన తనయుడు మంత్రి లోకేష్ రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకొస్తామని చెప్పి దావోస్ వెళ్లినా, సింగపూర్ వెళ్లినా పెట్టుబడులు మాత్రం సున్నా అని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి పల్లా దుర్గారావు ఎద్దేవా చేశారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. లోకేష్‌కు పబ్లిసిటీ చేసుకోవడం కోసం మాత్రమే విదేశాల్లో పర్యటిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో విచ్చలవిడిగా అవినీతి జరుగుతోందన్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే తప్పుడు కేసులు నమోదు చేస్తూ రెడ్ బుక్ రాజ్యాంగం అమలు చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో సీఎం తన బినామీ కంపెనీలకి వేల కోట్ల రూపాయల విలువైన భూములను కారుచౌకగా దోచిపెడుతున్నారని, రాష్ట్రం దోపిడీకి గురవుతోందన్నారు. ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ అవినీతే లక్ష్యంగా చంద్రబాబు పాలిస్తున్నారని ఆరోపించారు. ఈ విషయాలను విదేశీ పెట్టుబడిదారులు గుర్తించే రాష్ట్రానికి రావడానికి భయాందోళన చెందుతున్నారన్నారు. రాష్ట్ర ప్రజలు కూటమి నాయకులను గమనిస్తున్నారని, అవకాశం వచ్చినప్పుడు సరైన రీతిలో బుద్ధి చెబుతారన్నారు.

ఎర్నిమాంబకు ప్రత్యేక పూజలు


ఎర్నిమాంబకు హారతి ఇస్తున్న అర్చకుడు శ్రీకాంత్‌శర్మ

కంచరపాలెం: కాన్వెంట్ కూడలిలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఈవో డీవీఎస్ సురేష్‌బాబా నేతృత్వంలో ఆలయ అర్చకులు పులఖండం శ్రీకాంత్ శర్మ ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు, విశేషార్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పూజారి వాసుపల్లి విజయమ్మ అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తులకు ప్రత్యేక ఉచిత దర్శనాలతో పాటు రూ.10, రూ.50 ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. భక్తుల మౌలిక వసతులపై ఈవో సురేష్‌బాబా ప్రత్యే చర్యలు చేపట్టారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ సిబ్బంది రామకృష్ణ, ప్రసాద్, ట్రస్టు సభ్యులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు భక్తుల సౌకర్యాలను పర్యవేక్షించారు.

కనకమహాలక్ష్మికి శ్రావణలక్ష్మి పూజలు

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో నిర్వహిస్తున్న శ్రీలక్ష్మి పూజలు ఆదివారం 17వ రోజుకు చేరాయి. ఆదివారం ఈ పూజలో 12 మంది ఉభయదాతలు పాల్గొన్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.400 చెల్లించాలని ఆలయ ఈవో కె.శోభారాణి తెలిపారు. మరిన్ని వివరాలకు 0891-2711725, 2566514 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ఏఈవో కె.రాజేంద్రకుమార్, సహాయ ఇంజినీర్ డీపీఎస్ రామరాజు, పర్యవేక్షకుడు తిరుపతిరావు, వేదపండితులు, ఆలయ సిబ్బంది, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

అంతా వృథా..!

ముడసర్లోవ రోజ్ పార్కులో గుర్రపు స్వారీ శిక్షణ కేంద్రానికి బ్రేక్

- అర్ధాంతరంగా మధ్యలోనే పనులు ఆపేసిన జీవీఎంసీ అధికారులు
- నిరుపయోగంగా శిక్షణ కేంద్రం నిర్మాణాలు
- రూ.9 కోట్ల ప్రాజెక్ట్‌లో సగం నిధులు ఖర్చు
- ఎందుకూ పనికిరాకుండా పోయిన పార్కు స్థలం


ముడసర్లోవ రోజ్ పార్కులో గుర్రాల షెల్టర్ల కోసం చేపట్టిన నిర్మాణం


రెండు పార్కుల మధ్య బ్రిడ్జి చుట్టూ పిచ్చి మొక్కలు

ఆరిలోవ: ముడసర్లోవ రోజ్ పార్కులో జీవీఎంసీ నిర్మించ తలపెట్టిన గుర్రాల స్వారీ శిక్షణ కేంద్రం మధ్యలోనే నిలిచిపోయింది. పార్కు సముదాయంలోని ఎకరాల విస్తీర్ణం గల రోజ్ పార్కులో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో గుర్రపు స్వారీ కేంద్రం నిర్మాణానికి పునాది పడింది. దీని కోసం రూ.కోట్లు నిధులు కేటాయించి పనులు చేపట్టారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన అనంతరం ఇలాంటి శిక్షణ కేంద్రం అవసరం లేదంటూ దీని నిర్మాణాన్ని నిలిపేశారు. దీంతో ఇంతవరకు ఇక్కడ ఖర్చు చేసిన రూ.కోట్లు నిధులు మట్టిలో కలిసిపోయాయి. పచ్చని చెట్లతో నిండుగా ఉన్న ఈ పార్కు అసంపూర్తి నిర్మాణాలతో ప్రస్తుతం అస్తవ్యస్తంగా మారింది. ఈ పార్కులో ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించడానికి వీలులేని విధంగా తయారైంది.

మూడు ఎకరాలు.. రూ.9 కోట్లు

ముడసర్లోవ రిజర్వాయర్‌ను ఆనుకుని సుమారు 12 ఎకరాల పార్కు ఉంది. అందులోనే ఒక భాగంగా సుమారు మూడెకరాల విస్తీర్ణంలో రోజ్ పార్కు ఉంది. ఇది పిక్నిక్‌లకు ఎంతో అనుకూలంగా ఉండేది. దీనిలో జీవీఎంసీ అధికారులు గుర్రాల స్వారీ శిక్షణ కేంద్రం కోసం 2024 జనవరిలో నిర్మాణ పనులు చేపట్టారు. రూ.9 కోట్లు నిధులు కేటాయించారు. అప్పటి నుంచి దీని పనులు చకచకా జరిగాయి. అదే ఏడాది జూన్‌లో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన అనంతరం ఈ పనులను అధికారులు అర్ధాంతరంగా నిలిపేశారు. అప్పటికే ఇక్కడ సుమారు 50 శాతం పనులు జరిగిపోయాయి. దీని కోసం కేటాయించిన నిధుల్లో సగం ఖర్చు చేసేశారు.

నిరుపయోగం.. కళావిహీనం

పచ్చని చెట్లతో సుమారు మూడు ఎకరాల విస్తీర్ణంలో ఉన్న రోజ్ పార్కు కార్తీక మాసంలో నిత్యం పిక్నిక్‌లతో కళకళలాడేది. రాజకీయ పార్టీలు, కుల సంఘాలు, ఉద్యోగుల సభలు, సమావేశాలు తరుచూ జరుపుకునేవారు. ముడసర్లోవ, రోజ్ పార్కులను కలుపుతూ చిన్న ఫ్లైవర్ బ్రిడ్జి నిర్మించారు. దాని పైనుంచి సందర్శకులు ఈ పార్కుల్లోకి వెళ్తుండేవారు. ప్రస్తుతం ఈ బ్రిడ్జి పిచ్చి మొక్కలు, ముళ్ల తుప్పలతో నిండిపోయింది. ఆరిలోవ, పెదగదిలి, చినగదిలి ప్రాంతాలకు చెందిన యువకులు, పిల్లలు క్రికెట్, షెటిల్ బ్యాడ్మింటన్ వంటి ఆటలు ఆడుకోవడానికి అనూలంగా ఉండేది. ఇప్పుడు ఆ విశాలమైన స్థలం అసంపూర్తి నిర్మాణాలతో మాయమైంది. జీవీఎంసీ అధికారుల అనాలోచిత చర్యలకు రూ.కోట్లు విలువ చేసే ప్రభుత్వ భూమితోపాటు ఖర్చు చేసిన నిధులు వృథా అయ్యాయని స్థానికులు విమర్శిస్తున్నారు. రోజ్ పార్కును ప్రజలకు ఉపయోగపడేలా అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.


ఈ శిక్షణ కేంద్రంలో కొన్ని మేలు జాతి గుర్రాల కోసం ప్రత్యేకంగా ఓ షెల్టర్ నిర్మించారు. దానిలో ఒక్కో గుర్రం విశ్రాంతి కోసం ఒక్కో గదిని ఏర్పాటు చేశారు. ఇక్కడ శిక్షణ పొందదలచిన వారికి గుర్రపు స్వారీ నేర్పుతారు. దీనికి వీలుగా ప్రత్యేకంగా రెండు పెద్ద రింగ్‌లు ఏర్పాటు చేశారు. సందర్శకుల కోసం గ్యాలరీలు నిర్మించారు. ఇవన్నీ సగం పనులతో నిలిచిపోయాయి. శిక్షణ కేంద్రం అవసరం లేదంటూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన

నిధులు మట్టిపాలు...

తర్వాత జీవీఎంసీలో గత కౌన్సిల్ సభ్యులు తీర్మానం కూడా చేశారు. దీంతో ఇప్పటి వరకు జీవీఎంసీ ఖర్చు చేసిన నిధులు బూడిదలో పోసిన పన్నీరుగా మిగిలాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


గుర్రాలు స్వారీ చేయాల్సిన రింగులు

అధ్వానంగా బస్ షెల్టర్లు


బస్ షెల్టర్‌లో పాడైపోయిన కుర్చీ

బీచ్‌రోడ్డు: నిర్వహణ లేక బస్సు షెల్టర్లు అధ్వానంగా తయారయ్యాయి. ఆర్టీసీ కాంప్లెక్స్‌కు వంద అడుగుల దూరంలోని షెల్టర్ల పరిస్థితే ఇలా ఉంటే మిగిలిన వాటి దుస్థితిని అర్థం చేసుకోవచ్చు. ముఖ్యంగా జీవీఎంసీ ఎదురుగా ఉన్న మద్దిలపాలెం వైపు వెళ్లేందుకు ప్రయాణికులు నిరీక్షించే షెల్టర్, జగదాంబ వైపు వెళ్లే వారు వేచి ఉండే షెల్టర్ దారుణంగా తయారయ్యాయి. బస్సులు వచ్చే వరకు ప్రయాణికులు వేచి ఉండే విధంగా షెల్టర్‌లో కుర్చీలు ఏర్పాటు చేసినప్పటికీ నిర్వహణలో నిర్లక్ష్యం కారణంగా పూర్తిగా పాడైపోయాయి. వాటిపై కూర్చునేందుకు వీలు లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు వాటి పరిసరాలూ అపరిశుభ్రంగా తయారయ్యాయి. అయినప్పటికీ సంబంధిత అధికారులు దృష్టి సారించడం లేదని ప్రయాణికులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా పాడైన కుర్చీల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని, పరిసరాలను శుభ్రంగా ఉంచేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

చంద్రబాబు పాలనలో మహిళలకు రక్షణ కరువు

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు


పన్నెండో వార్డులో వృద్ధునికి కూటమి ప్రభుత్వం మోసాలు వివరిస్తున్న మొల్లి అప్పారావు

ఆరిలోవ : తూర్పు నియోజకవర్గం పరిధి పన్నెండో వార్డులో వైఎస్సార్‌సీపీ నాయకులు ఆదివారం 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ' కార్యక్రమం నిర్వహించారు. వార్డు పరిధి నెహ్రూనగర్‌లో స్థానిక నాయకులతో కలిసి నియోజకవర్గ పార్టీ సమన్వయకర్త మొల్లి అప్పారావు గడప గడపకు వెళ్లి కూటమి పాలనలోని వైఫల్యాలు, చంద్రబాబు మోసాలు, జరుగుతున్న కుట్రలు, అమలుకాని హామీలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళలకు సంపూర్ణ రక్షణ కల్పించారన్నారు. మహిళల కోసం ప్రత్యేకంగా దిశ చట్టం అమలు చేశారని గుర్తు చేశారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో చంద్రబాబు నాయుడు నేతృత్వంలో మహిళలకు రక్షణ కరువైందన్నారు. నిత్యం మహిళలపై అత్యాచారాలు జరుగుతున్నాయని, వాటిని నియంత్రించడంలో ప్రభుత్వం విఫలమైందని తెలిపారు. మహిళలపై జరుగుతున్న నేరాల జాబితాలో దేశంలో ఆంధ్రప్రదేశ్ రెండో స్థానంలో ఉందన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు మొల్లి హేమంత్, కనకరాజు, సత్తి మందారెడ్డి, మువ్వల శ్రీను, సారిపల్లి శ్రీను, అప్పలరాజు, గోవిందమ్మ, బంధం శ్రీను, సంతోష్, శ్రీనివాస్ రెడ్డి, మోహన్, అర్జున్, కిశోర్, శ్రీను, జేమ్స్, వరహాలు, బుజ్జి, సంజీవి, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.


• ముంచెత్తిన మురుగు

వ్యర్థాల తొలగింపులో జీవీఎంసీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో మ్యాన్‌హోల్స్ ఎక్కడికక్కడ పొంగిపొర్లుతున్నాయి. మురుగు నీరు రోడ్లపై పారుతూ ఆయా ప్రాంతాలన్నీ కంపుకొడుతున్నాయి. ఎంవీపీ కాలనీ డబుల్ రోడ్డులో ఆదివారం ఉదయం ఇలా మ్యాన్‌హోల్ ముంచెత్తడంతో రోడ్డంతా మురుగుమయమైంది. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. జీవీఎంసీ పారిశుధ్య సిబ్బంది దాదాపు 4 గంటలపాటు శ్రమిస్తే తప్ప మురుగు పోలేదు.

– ఎంవీపీ కాలనీ

ఇగ్నో ప్రవేశాలకు గడువు పెంపు

ఎంవీపీ కాలనీ : ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) – 2025 ప్రవేశాలకు సంబంధించి దరఖాస్తుల గడువును పొడిగించింది. ఈ మేరకు ఇగ్నో విశాఖపట్నం ప్రాంతీయ కేంద్రం సంచాలకుడు డాక్టర్ గోనిపాటి ధర్మారావు ఓ ప్రకటన విడుదల చేశారు. ఇగ్నో ద్వారా డిగ్రీ, పీజీ, ఎంబీఏ, డిప్లమో, సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశాలు కల్పించనున్నారు. ఈ ప్రవేశాలు పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో జరగనున్నాయి. కేంద్రం పరిధిలోని 5 జిల్లాల విద్యార్థులకు ప్రవేశాలు కల్పిస్తున్నారు. https://ignouadmission.samarth.edu.in వెబ్‌సైట్ ద్వారా అర్హులైన విద్యార్థులు ఆయా కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవచ్చు. అయితే ఈ ప్రవేశాలకు దరఖాస్తు చేసుకునేందుకు ఆగస్టు 15 చివరి తేదీగా పేర్కొన్నారు. పూర్తి వివరాలకు ఎంవీపీ కాలనీ ఉషోదయ కూడలిలోని ఇగ్నో కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు.

విమ్స్ ప్రవేశ ద్వారాల వద్ద కనిపించని సెక్యూరిటీ


బీఆర్‌టీఎస్ వైపు సెక్యూరిటీ గార్డు లేని విమ్స్ ద్వారం


సెక్యూరిటీ గార్డు లేని విమ్స్ ప్రాంగణం లోపలి గేటు

ఆరిలోవ: విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (విమ్స్)లో ముఖ్యమైన చోట్ల సెక్యూరిటీ గార్డులు కనిపించడం లేదు. సాధారణంగా ప్రభుత్వ ఆస్పత్రులు, కార్యాలయాల ప్రధాన ద్వారాల వద్ద సెక్యూరిటీ గార్డులను నియమిస్తారు. ఆస్పత్రుల్లో ప్రధాన ద్వారాలతోపాటు లోపల ఓపీ, కన్సల్టెన్సీ గదులు, ఆపరేషన్ థియేటర్ల ద్వారాలు, ఇన్‌పేషెంట్ వార్డులు, ఎమర్జెన్సీ వార్డు, పార్కింగ్ తదితర వాటి వద్ద సెక్యూరిటీ గార్డులను ఏర్పాటు చేస్తారు. ఇదేమాదిరిగా విమ్స్‌లో ఓ ప్రైవేటీ సెక్యూరిటీ ఏజెన్సీ ద్వారా 75 మంది సిబ్బందిని నియమించారు. వారు రెండు షిఫ్టులలో విధులు నిర్వహిస్తున్నారు. వారిలో పగలు షిఫ్ట్‌లో 50 మంది ఆయాచోట్ల విధులలో ఉండాలి. అయితే అవసరమైన చోట్ల ఈ సిబ్బంది కనిపించడం లేదు. కొన్నాళ్లుగా ప్రధాన ద్వారాల వద్ద సెక్యూరిటీ గార్డులు కానరావడం లేదు. బీఆర్‌టీఎస్ రోడ్డు వైపు ప్రధాన ద్వారం, లోపల ఆవరణ (కేంటీన్ ఎదురుగా)లో ద్వారం వద్ద సెక్యూరిటీ సిబ్బంది ఉండడం లేదు. దీంతోపాటు లోపల అత్యవసర విభాగం వార్డు, ఓపీల వద్ద కూడా సిబ్బంది ఉండాల్సిన సంఖ్య కంటే తక్కువ మంది విధులు నిర్వహిస్తున్నారు. విమ్స్‌లో ఇక్కడ నియమించాల్సిన సెక్యూరిటీ సిబ్బంది కంటే తక్కువ మందితో ప్రైవేట్ ఏజెన్సీ మమ అనిపించేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రధాన ద్వారాల వద్ద సెక్యూరిటీ లేకపోవడంతో రాత్రి వేళల్లో ఇన్‌పేషెంట్లను చూడడానికి మద్యం, గంజాయి మత్తులో కొందరు వెళ్లి హడావిడి చేస్తున్న సంఘటనలు పలుసార్లు ఇక్కడ చోటు చేసుకొన్నాయి. గతంలో రాత్రి సమయంలో మద్యం మత్తులో కొందరు ఇక్కడి వైద్య సిబ్బంది, సెక్యూరిటీ గార్డులపై దాడి చేసి గాయపరిచిన విషయం తెలిసిందే. సెక్యూరిటీ సిబ్బంది అరకొరగా ఉండడం వల్లే ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయని రోగుల బంధువులు, వైద్య సిబ్బంది అభిప్రాయపడుతున్నారు.

సామరస్యంతోనే ప్రపంచ శాంతి


గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఆచార్య బాలమోహన్‌దాస్, నరవ ప్రకాశరావు

సీతంపేట: హిరోషిమా, నాగసాకి సంస్మరణ దినం సందర్భంగా ప్రపంచ శాంతిని కోరుతూ ఐఏఆర్ఎఫ్ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక బుల్లయ్య కళాశాలలోని గాంధీ సెంటర్‌లో సదస్సు నిర్వహించారు. సంస్థ చైర్మన్ నరవ ప్రకాశరావు అధ్యక్షతన ముందుగా మహాత్మా గాంధీజీ విగ్రహానికి నివాళులర్పించి, ప్రపంచ శాంతిని కోరుతూ సర్వమత ప్రార్థనలు చేశారు. ఐఏఆర్ఎఫ్, యూఎన్‌వో ద్వారా ప్రపంచ శాంతి కోసం సభ్య దేశాల సహకారంతో నిరంతరం కృషి చేస్తోందని ప్రకాశరావు తెలిపారు. ఆచార్య వి.బాలమోహన్‌దాస్, డాక్టర్ నాగసూరి, వేణుగోపాల్, బ్రహ్మకుమారి రామేశ్వరి మాట్లాడుతూ వివిధ వర్గాలు, దేశాల మధ్య సామరస్యం సాధించిన నాడే ప్రపంచ శాంతి సాధ్యమన్నారు. 80 ఏళ్లుగా యుద్ధాలు జరుగుతూనే ఉన్నాయని, ప్రపంచ శాంతి కోసం వాటిని మానుకోవాలని హితవు పలికారు. మానవాళికి కావాల్సింది అణుబాంబులు కాదని, అన్నం, వస్త్రం కావాలన్నారు. అనంతరం శాంతి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో హుస్సేన్, చాట్ల బాబూరావు, రెడ్డి, కరుణ, నరసింహారావు పాల్గొన్నారు.

జూలో సింహాలపై అవగాహన


వెటర్నరీ విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న క్యూరేటర్ మంగమ్మ

ఆరిలోవ: ఇందిరాగాంధీ జూ పార్కులో ప్రపంచ సింహాల దినోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జూ బయోస్కోప్‌లో నిర్వహించిన సమావేశంలో సందర్శకులు, వెటర్నరీ విద్యార్థులకు సింహాలపై అవగాహన కల్పించారు. క్యూరేటర్ జి.మంగమ్మ మాట్లాడుతూ పర్యావరణంలో సింహాల ప్రాధాన్యం, జూ పార్కుల్లో వాటి సంరక్షణ చర్యలను వివరించారు. జూ పార్కులో ఒక జత సింహాలున్నాయన్నారు. వాటి సంరక్షణకు నిరంతరం జూ వెటర్నరీ సిబ్బంది, యానిమల్ కీపర్లు జాగ్రతలు తీసుకుంటున్నారన్నారు. వాటికి అందిస్తున వైద్య సేవలు, ఆహారం, జాగ్రత్త చర్యలను వివరించారు. ఇటీవల జూలో ఒక సింహాన్ని వివేక్ గోయంకా అనే వ్యక్తి దత్తత తీసుకున్నారన్నారు. మిగిలిన వన్యప్రాణులను కూడా దత్తత తీసుకోవడానికి దాతలు ముందుకు రావాలని ఆమె కోరారు. దత్తత తీసుకున్న వారికి ఆదాయ పన్నులో 50 శాతం వరకు మినహాయింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో జూ అసిస్టెంట్ క్యూరేటర్లు బి.గోపి, పి.వి.చౌదరి, వెటర్నరీ వైద్యుడు పి.భానుబాబు, సెక్షన్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

శబరిమలలో నిత్యాన్నదానానికి ఏర్పాట్లు


ట్రస్టు సమావేశంలో పాల్గొన్న పైలా ఆదిమోహన్‌రెడ్డి, ఇతర సభ్యులు

సీతంపేట: విశాఖలో నూతనంగా ప్రారంభించిన అఖిల భారత అయ్యప్ప చిన్ముద్ర సేవా ట్రస్టు ఆధ్వర్యంలో మండల, మకర జ్యోతి సీజన్లలో శబరిమల వెళ్లే అయ్యప్ప భక్తుల కోసం అక్కడ నిత్యాన్నదానం నిర్వహించనున్నట్టు ట్రస్టు సభ్యుడు పైలా ఆదిమోహన్‌రెడ్డి తెలిపారు. శంకర మఠంలో ఆదివారం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒడిశా, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అయ్యప్ప భక్తులతో ట్రస్టు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రస్టు ద్వారా చేపట్టబోయే సేవా కార్యక్రమాలను వివరించారు. ప్రతి ఏటా నవంబర్ 16 నుంచి జనవరి 17 వరకు శబరిమలలో తమ ట్రస్టు తరఫున నిత్యాన్నదానాన్ని మూడు పూటలా నిర్వహిస్తామని చెప్పారు. భక్తులకు వైద్య సేవలందించేందుకు వీలుగా ఒక అంబులెన్స్ అందుబాటులో ఉంచుతామన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానంలో ఇతర రాష్ట్రాల వారికి బోర్డు సభ్యులుగా స్థానం కల్పిస్తున్న విధంగా తెలుగు రాష్ట్రాల వారికి ట్రావెన్‌కోర్ బోర్డులో అవకాశం కల్పించాలని కోరారు. ఇరు రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా ట్రావెన్‌కోర్ బోర్డును కోరనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు రుద్ర కోటేశ్వరరావు, రాజేష్ గౌడ్, అనంతరావు, వైకుంఠరావు, శ్రీహరి, మస్తాన్‌రెడ్డి, రమణ, వీరాస్వామి పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

మర్రిపాలెం: రౌడీ షీటర్లు నేరాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని కంచరపాలెం ఐదో పట్టణ సీఐ రవి కుమార్ హెచ్చరించారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆదివారం రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ రౌడీషీటర్లపై పోలీసుల నిఘా ఎల్లవేళలా ఉంటుందని, హద్దుమీరి ప్రవర్తిసే తగిన చర్యలు తీసుకుంటామన్నారు. గొడవలు, తగాదాలకు దూరంగా ఉండాలని, కుటుంబ సభ్యులతో కలిసి సంతోషంగా గడపాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ రవికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో హనుమాన్ చాలీసా పారాయణం


ఆర్కేబీచ్ రోడ్డులో హనుమాన్ చాలీసా పారాయణ చేస్తున్న భక్తులు

ఎంవీపీ కాలనీ: శ్రీ సత్యసాయి సేవా సంస్థల విశాఖ యువజన విభాగం ఆధ్వర్యంలో హనుమాన్ చాలీసా పారాయణ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆదివారం సాయంత్రం ఆర్కేబీచ్‌లోని కాళీమాత ఆలయం ఆవరణలో ఈ కార్యక్రమం నిర్వహించారు. శ్రీ సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాల్లో భాగంగా విశ్వశాంతి, విశ్వమానవ కల్యాణం కోసం 11 సార్లు సామూహికంగా హనుమాన్ చాలీసా పారాయణ నిర్వహించారు. భక్తులు, యువజనులు ఏకాగ్రతతో పాల్గొనడంతో ఆర్కే బీచ్ పరిసరాల్లో భక్తి పారవశ్యం నెలకొంది. శతజయంతి ఉత్సవాల సందర్భంగా రానున్న రోజుల్లో మరిన్ని సేవా, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నామని యువజన విభాగం జిల్లా సమన్వయకర్త సాయి ప్రశాంత్ తెలిపారు. కార్యక్రమంలో పలువురు సత్యసాయి సేవా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

నాలుగు పుస్తకాల ఆవిష్కరణ


పుస్తకాలు ఆవిష్కరిస్తున్న మాజీ ఎంపీ శంకరరావు, అతిథులు

సీతంపేట: విశాఖ సంస్కృతి ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఆదివారం ఒకేసారి నాలుగు పుస్తకాలు ఆవిష్కరించారు. విశాఖ సంస్కృతి 13వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన సభలో అతిథుల చేతుల మీదుగా నాలుగు పుస్తకాల ఆవిష్కరణ జరిగింది. రచయిత మోణంగి ప్రవీణ రచించిన తొలి అడుగులు కథా సంపుటి, గన్నవరపు నరసింహమూర్తి రచించిన మిథునం, గన్నవరపు నరసింహమూర్తి కథలు, మంచి సినిమాల పుస్తకాలను అతిథులు పూర్వ ఎంపీ డి.వి.జి.శంకరరావు, గరివిడి పశు వైద్యశాల డీన్ డాక్టర్ మక్కెన శ్రీను, అఖిల భారత ధర్మకర్త చెరువు రామకోటయ్య, సత్య విద్యా సంస్థల డైరక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు ఆవిష్కరించారు. అనంతరం విశాఖ సంస్కృతి ప్రత్యేక సంచిక ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ తెలుగు సాహిత్యం, తెలుగు భాష ఉన్నతికి 13 ఏళ్లుగా పాటుపడుతున్న విశాఖ సంస్కృతి మాస పత్రిక సంపాదకుడు శిరేల సన్యాసిరావు నిస్వార్థ కృషిని అభినందించారు. మంచి ఇతివృత్తం ఉన్న కథలు, సాహిత్యం, చారిత్రక అంశాలు, కవితలు ప్రతి నెలా అందిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన హాస్య కథలు, కవితల పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. రచయిత మేడా మస్తాన్‌రెడ్డి వ్యాఖ్యాతగా వ్యవహరించారు.

స్మార్ట్ మీటర్లు వద్దంటూ ప్రచారం


స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్న నాయకులు

అల్లిపురం: స్మార్ట్ మీటర్లతో విద్యుత్ వ్యవస్థ అంతా అదానీ చేతిలోకి వెళ్లిపోతుందని సీపీఎం సీనియర్ నాయకుడు వై. రాజు అన్నారు. జగాంబ జోన్ సీఐటీయూ ప్రధాన కార్యదర్శి కర్ర చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఆదివారం భూపేష్‌నగర్‌లో స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లు సెల్‌ఫోన్ రీచార్జి చేసుకునే విధంగా ముందుగానే చేసుకోవాలని, ఎక్కువ ఏ టైములో విద్యుత్ వాడతామో ఆ టైంలో యూనిట్ రేట్ ఎక్కువగా చూపిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ స్మార్ట్ మీటర్లను ప్రజలందరూ వ్యతిరేకించాలని ఆయన పిలుపునిచ్చారు. ఇదే ప్రభుత్వం ప్రతిపక్షంలో ఉన్నప్పుడు స్మార్ట్ మీటర్లు పెట్టిస్తే పగలగొట్టండి అని పిలుపునిచ్చిందన్నారు. ఇప్పుడు ఏ మొహం పెట్టుకుని స్మార్ట్ మీటర్లు పెట్టడానికి ప్రయత్నిస్తుందని ప్రశ్నించారు. భూపేష్‌నగర్ లో మహిళలందరూ కార్యక్రమంలో పాల్గొని సీపీఎం ఇచ్చిన స్టిక్కర్లను స్వచ్ఛందంగా వాళ్ల మీటర్ పక్కనే అంటించి స్మార్ట్ మీటర్లను అనుమతించబోమని ప్రతిజ్ఞ చేశారు.